జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 17-3-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 277 పేజీలు: 4 వెల : రూ.7

# గోల్‌మాల్




* కొత్తూరు, భామినిలో నకిలీ బంగారం ముఠా
* కొందరు బంగారు వర్తకులు మధ్యవర్తులు
* ప్రైవేట్ బ్యాంకులో బంగారం తాకట్టు
* ఆడిట్‌లో నకిలీ బంగారమని నిర్ధారణ
* మోసపోతున్న కొనుగోలుదారులు
* ఒకప్పుడు దొంగనోట్లు, ఇప్పుడు నకిలీ బంగారం పేరిట మోసపోతున్న ఏజెన్సీవాసులు

**శ్రీకాకుళం క్రైం, మార్చి 16 (వార్త):** ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని ఏజెన్సీలో నకిలీ బంగారాన్ని కొందరు విక్రయిస్తూ కాసులు చేసుకుంటున్నారు. తక్కువ ధరకే అంటూ తళతళమెరుస్తూ అసలు బంగారాన్ని మెరిపించేలా ఈ నాసిరకం బంగారాన్ని అమాయక ప్రజలను అమ్ముతూ గోల్‌మాల్ చేస్తున్నారు. ఈ విక్రయదారులకు కొత్తూరు ప్రాంతానికి చెందిన కొందరు బంగారు వర్తకులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారన్న పుకార్లు ఉన్నాయి. అమాయక ప్రజలు ఈ వ్యాపారులను నమ్మి ఆ నాసిరకం బంగారాన్ని కొనుగోలు చేసి మోసపోతున్నారు. కొనుగోలు చేసిన బంగారానికి గాను అమ్మకందారులు ఎటువంటి రశీదులు ఇవ్వరు. దీంతో ఈ బంగారాన్ని కొనుగోలు చేసిన వారు ఆ తర్వాత జరిగిన మోసాన్ని గమనించినప్పటికీ ఎటువంటి ఆధారాలు వారి వద్ద లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయలేక, బంగారు వ్యాపారాలను నిలదీయలేక కన్నీరుమున్నీరవుతున్నారు.




కొత్తూరు మండల కేంద్రంలో నకిలీ బంగారం వ్యవహారం బయటపడింది. కొత్తూరు మండలానికి పక్కన ఉన్న మన్యం జిల్లా, భామిని మండలానికి చెందిన ఒక వ్యక్తి, కొత్తూరు మండలం మెట్టూరు గ్రామానికి చెందిన వ్యక్తితో పాటు మరో ఇద్దరు కొత్తూరులోని ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో సుమారు మూడు తులాల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి సుమారు రెండులక్షల రూపాయలు అప్పు తీసుకున్నారు. ఇటీవల ఆ ఫైనాన్స్ కంపెనీలో ఆడిట్ జరిగింది. వారు ఈ బంగారు ఆభరణాలు పరిశీలించారు. ఈ ఆభరణాలు నకిలీవని గుర్తించారు. వెంటనే ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఆ బంగారం తాకట్టు పెట్టిన వారికి ఫోన్ చేసి విషయం తెలియజేసి, వెంటనే అప్పు తీర్చాలని డిమాండ్ చేశారు. అలాగే మన్యం జిల్లా, భామిని మండలం, పెద్దదిమిలి గ్రామానికి చెందిన పత్తిక కృష్ణ అనే వ్యక్తి కూడా వరే వ్యక్తి దగ్గర కొంత బంగారం తాకట్టు పెట్టి నగదు తీసుకున్నాడు. ఆయన కూడా ఈ బంగారాన్ని తనిఖీ చేయగా నకిలీ బంగారమని బయటపడింది. దీంతో ఈ వ్యవహారం బయటపడింది. కొత్తూరులోని ఓ బంగారం షాప్ యజమాని మధ్యవర్తిగా ఉండి బంగారం కొనుగోలు చేయించాడు. దీనికిగాను ఆయనకు ఆ ముఠా సభ్యుల నుంచి కొంత మొత్తం అందిందని సమాచారం. అయితే మధ్యవర్తిగా ఉన్న ఈ బంగారం షాపు యజమాని వద్దకు కొనుగోలు చేసిన వ్యక్తి వెళ్లి నిలదీశారు. దీంతో ఈ వ్యాపారి ముఖం చాటేయడమే గాకుండా తనకు సంబంధం లేదని, నీ ఇష్టమొచ్చినది చేసుకో అని చెబుతుండడంతో కొనుగోలుదారుడు అవాక్కయ్యాడు. ఇటువంటివి ఘటనలు ఇటీవల చాలా వరకూ వెలుగుచూసినప్పటికీ సరైన ఆధారాలు లేకపోవడంతో నకిలీ బంగారం కొనుగోలు చేసిన వారు పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోతున్నారు. గతంలో ఏజెన్సీలో నకిలీ నోట్ల చలామణి చేయగా, ప్రస్తుతం నకిలీ బంగారాన్ని చలామణి చేస్తూ అమాయక ప్రజలను మోసగిస్తూ కాసులు చేసుకుంటున్నారు.

(ఈ నకిలీ బంగారం ముఠాలో ఉన్నది ఎవరు, వారికి బంగారు వ్యాపారులు మధ్యవర్తులుగా ఎవరెవరు సహకరిస్తున్నారన్న దానిపై 'జాతీయ వార్త'లో త్వరలో మరో కథనంతో కలుద్దాం)

# రహదారులు.. రక్తసిక్తం

* అతివేగంతో లారీని ఢీకొన్న కారు
* దంపతుల దుర్మరణం
* మరో ముగ్గురికి తీవ్రగాయాలు
* సారవకోట మండలం కురిడింగి వద్ద ప్రమాదం
* పాతపట్నంలో విషాదఛాయలు

3లో



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఉదయం పది గంటలకే గ్రీవెన్స్‌సెల్

**శ్రీకాకుళం, మార్చి 16(వార్త):** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్ సమయాన్ని మార్చారు. ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకే గ్రీవెన్స్ సెల్ ప్రారంభమవుతుందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

# చిరస్మరణీయుడు.. పొట్టి శ్రీరాములు



* కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్
* అమరజీవి విగ్రహానికి నివాళి

**శ్రీకాకుళం, మార్చి 16 (వార్త):** తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతిని శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. శ్రీకాకుళం పాత బస్టాండ్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, ఆమదాలవలస, నరసన్నపేట శాసనసభ్యులు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తిలతో కలిసి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు ఆశయాలు భావితరాలకు ఆదర్శమన్నారు. వారి విలువలను తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సత్యాగ్రహం, స్వాతంత్ర్య ఉద్యమంలో పొట్టి శ్రీరాములు చురుగ్గా పాల్గొన్నారని ఆయన గుర్తు చేశారు. ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ మాట్లాడుతూ, తెలుగువారి క్షేమం, అభివృద్ధి కోసం తమ జీవితాన్ని అర్పించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు నంబర్ వన్ గా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని, స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళికతో ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే నంబర్ వన్ గా నిలపాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులతో పాటు టీడీపీ నాయకులు మాదారపు వెంకటేష్, విభూది సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్‌లో..




నేటి యువతకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయులని, అటువంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు 124వ జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులన్నారు. వారి జీవిత చరిత్ర భావితరాలకు ఆదర్శం కావాలి. అనుకున్న లక్ష్యాలను అధిగమించడానికి ప్రాణాలను కూడా పనంగా పెట్టిన మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి ఇ. అనురాధ, ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్ మోహనరావు, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎల్. అప్పారావు, కార్యాలయ సిబ్బంది మమత, జి. గణేష్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## పొట్టి శ్రీరాములు త్యాగం
## నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**పలాస, మార్చి16(వార్త):** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భాషా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని, ఆంధ్ర ఉద్యమం కమిటీ ద్వారా 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఈనాటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. మదరాసులో మహాలక్ష్మమ్మ, పొట్టి గురవయ్య దంపతులకు 1901మార్చి 16 న జన్మించారు. దండి ఉప్పు సత్యాగ్రహ సమయంలో మహాత్మా గాంధీజీతో కలసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ దీక్ష చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అమర్, కృష్ణ, పండా, శీను, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ కాంప్లెక్స్‌లో..



**శ్రీకాకుళం, మార్చి 16 (వార్త):** శ్రీకాకుళం బస్ స్టేషన్ ఆవరణలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ శ్రీకాకుళం-1 అమరసింహుడు.. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఒక నిరుపేద కుటుంబంలో జన్మించి,ఉన్నత చదువుల చదువుకొని రైల్వేలో ఉద్యోగాన్ని సాధించారన్నారు. మద్రాసులో భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం సుమారుగా 58 రోజులు అమర నిరాహార దీక్ష చేసి అసువులు బాశారన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించడంలో పొట్టి శ్రీరాములు పోరాట పటిమను శ్లాఘనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మాస్టార్లు, ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, ట్రాఫిక్ సూపర్వైజర్లు, గ్యారేజ్ సిబ్బంది సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## అమరజీవికి నివాళి

**శ్రీకాకుళం క్రైం, మార్చి 16 (వార్త):** అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతిని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఉదయం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తిని కొనియాడారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన, ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి, ప్రాణాలను అర్పించి, అమరజీవిగా నిలిచిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. మహాత్మ గాంధీ భోదించిన ఆశయాల కొరకు జీవితాంతం కృషి చేసిన ఘనత శ్రీరాములదని తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో మహాత్మ గాంధీ వెంట నడిచి, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని స్వాతంత్ర సమరయోధుడిగా కీర్తి గాంచిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు ఆని కొనియాడారు. ఈ జయంతి వేడుకల్లో అదనపు ఎస్పి కెవి రమణ, డిఎస్పీలు వివేకానంద్, శేషాద్రి రిజర్వ్ ఇనస్పెక్టర్ నర్సింగరావు,ఇతర పోలీసు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మరువాడలో మొక్కజొన్న అగ్నికి ఆహుతి



**వంగర, మార్చి 16(వార్త):** మరువాడ గ్రామంలో మొక్క జొన్న పంట అగ్నికి ఆహుతైంది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలు సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 20 సెంట్లు పంట పొలంలోగల మొక్కజొన్న పంటతో పూర్తిగా కాలి బూడిదయ్యింది. ఈ మేరకు ఆ గ్రామ విలేజి రెవెన్యూ అధికారి బెజ్జిపురపు బలరాం కృష్ణ మొక్కజొన్న పంటకు జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. మరువాడ గ్రామంలోనే రైతులు మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పు అంటించారు. అది రాజుకొని రైతు పక్క నున్న సింగిరెడ్డి శ్రీనివాసరావు సాగు చేస్తున్న ఈమొక్కజొన్న పంటకు అంటుకుని దగ్ధమైంది. నష్టపోయిన పంటకు పరిహారం అందేలా చూడాలని రైతు సింగిరెడ్డి శ్రీనివాసరావు కోరుతున్నారు.

# రహదారులు.. రక్తసిక్తం



* అతివేగంతో లారీని ఢీకొన్న కారు
* దంపతుల దుర్మరణం
* మరో ముగ్గురికి తీవ్రగాయాలు
* సారవకోట మండలం కురిడింగి వద్ద ప్రమాదం
* పాతపట్నంలో విషాదఛాయలు



**శ్రీకాకుళం క్రైం, సారవకోట, మార్చి 16 (వార్త):** రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. అతివేగం ప్రాణాలను హరిస్తున్నాయి. రెప్పపాటులో జరుగుతున్న ప్రమాదాలు పలు కుటుంబాలను దిక్కులేనివారుగా చేస్తున్నాయి. లావేరు మండలం బుడుమూరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందిన ఘటన మరువకముందే ఆదివారం సారవకోట మండలం కురిడింగి వద్ద మరో ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పాతపట్నానికి చెందిన పెద్దగోపి వెంకట వరప్రసాదరావు తన భార్య వాణి, చిన్న కుమారుడు కీర్తివిహార్, చెల్లి హేమలత, బావ చక్రవర్తితో కలిసి ఆదివారం శ్రీకాకుళంలో బంధువుల పెళ్లికి కారులో వెళ్లారు. మధ్యాహ్నం తిరుగుపయనమయ్యారు. సారవకోట మండలం కురిడింగి వద్దకు చేరుకున్న సమయంలో ఎదురుగా వస్తున్న లారీని వారి కారు ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో వెంకట వరప్రసాదరావు, వాణి స్పాట్‌లో చనిపోయారు. వెనుకభాగంలో కూర్చొన్న విహార్ ముఖానికి, హేమలత, చక్రవర్తి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కారులో ఉన్న క్షతగాత్రులను బయటకు తీసి 108 వాహనంలో పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. కీర్తి విహారం పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద ఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సారవకోట ఎస్ఐ అనిల్ తెలిపారు. మృతి చెందిన పెదగౌరపు వెంకటప్రసాదరావు బీజేపీ మాజీ మండలశాఖ అధ్యక్షుడు. పాతట్నం నుంచి విజయవాడ, గుంటూరుకు ఒక ప్రైవేటు ట్రావెల్స్ నిర్వహించేవారు. ఈయనకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు విశాల్ యూఎస్‌ఈలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నకుమారుడు విహార్ ఐఐటీ భువనేశ్వర్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు.





## 20 కేజీల గంజాయి స్వాధీనం

**పాతపట్నం, మార్చి 16 (వార్త):** మండలంలోని కాపుగోపాలపురం జంక్షన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం 20 కేజీల గంజాయితో ఇద్దరిని పట్టుకున్నామని టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్ వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పాతపట్నం పోలీసులు అదుపులోకి తీసుకుని వారి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడిందన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**శ్రీకాకుళం క్రైం, మార్చి 16 (వార్త):** ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆటో స్టాండ్‌వద్ద ఉన్న కాలువలో పడివున్న ఓ వ్యక్తిని ఆటో డ్రైవర్లు గమనించి బయటకుతీశారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందజేశారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు వచ్చి అతడిని రిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. సుమారు 42 నుంచి 45 ఏళ్లు వయస్సు ఉంటుందని, ఆయన ఆచూకీ తెలిసిన వారు 6309990824,6309990843 నెంబర్లకు వెంటనే సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## బిహార్ యువకుడు ఆత్మహత్య

**మందస, మార్చి 18 (వార్త):** హరిపురం రైల్వేస్టేషన్ సమీపంలో బ్యాటరీ, ఎలక్ట్రికల్ మెకానిక్‌గా పనిచేస్తున్న సోనూ(32) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మందస ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ అందించిన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన సోనూ బ్యాటరీలు, వాహనాలకు ఎలక్ట్రికల్ పనులు చేస్తూ గత పదేళ్లుగా ఇక్కడ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది కిందట గొడవలు కారణంగా భార్య పుట్టింటికి (బీహార్) వెళ్లిపోయింది. దీంతో ఒక్కడే ఉంటున్నాడు. ఆదివారం ఉదయ స్నేహితుడితో కలసి మద్యం తాగాడు. ఆ తర్వాత ఏమైందోగాని సాయంత్రం సమయంలో ఇంటిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హరిపురం ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

# శక్తి యాప్‌పై అవగాహన




**సంతబొమ్మాళి, మార్చి 16 (వార్త):** మత్తు పదార్థాల రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు యువతి యువకులంతా ముందుకు రావాలని సంతబొమ్మాళి ఎస్సై సింహాచలం పిలుపునిచ్చారు. ఆదివారం మరువాడ పంచాయతీ డి.మరువాడ గ్రామంలో ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని సూచించారు. వీటి వాడకం వల్ల ఆరోగ్యం క్షీణించడంతోపాటు భవిష్యత్తు అంధకారమవుతుందని వివరించారు. గంజాయి హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలు విక్రయించిన రవాణా చేసిన వాడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే శక్తి యాప్ పై అవగాహన కల్పిస్తూ మహిళలు తమ ఫోన్ లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకొని ఆపద సమయంలో పోలీసుల నుంచి తక్షణ సాయం పొందాలని సూచించారు. ప్రభుత్వం మహిళలు బాలికల భద్రత కోసం శక్తి యాప్ ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ ప్రధానంగా మహిళలకు ఆపద సమయంలో ఉపయోగం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి సురాడ దాసురాజు, మహిళలు, యువకులు తదితరులున్నారు.

## పేకాట శిబిరంపై దాడి

**కొత్తూరు,మార్చి 16 (వార్త):** కొత్తూరు గ్రామ పంచాయతీలో ఆదివారం పేకాట అడుతున్న వారిపై పోలీసులు దాడి చేశారు. కొత్తూరు ఎస్.ఐ అమీర్ ఆలీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు గ్రామంలో ఓ ఇంటి వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4,820 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు పెట్టామన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జీడికి తెగులు

**పలాస,మార్చి 16(వార్త):** ఉద్దాన ప్రాంత ప్రజలకు ప్రధాన జీవనాధారమైన జీడి పంట ప్రస్తుతం తెగుళ్లబారిన పడుతోంది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయం చేశామని తీరా ప్రస్తుతం జీడి పూత వచ్చే సమయంలో బూజు తెగులు సోకింది. పిక్క ఎండిపోయి తెల్లటి బూజు పడుతోంది. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. పలాస, మందస, వజ్రపుకొత్తూరు, మందస తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో జీడిపంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు ఉద్యానవన శాఖాధికారులు తగిన సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. జీడి పంటను అప్పులు చేసివ్యవసాయం చేశామని, ప్రస్తుతం కొత్తరకము జబ్బు సోకడము వల్ల చేతికి అందే సమయానికి బూజు తెగులు సోకడం తో ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో పడ్డామని రైతు సంఘ నేత కోనేరు కామేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెల్ల బూజు పట్టి జీడి పువ్వంతా ఎండిపోయిందన్నారు. ఉద్యాన వన శాఖ అధికారులు అసలు పట్టించుకోవడం లేదని వాపోయారు.

### అమరజీవి త్యాగం..
# తెలుగు జాతికి గర్వకారణం

**సోంపేట, మార్చి16 (వార్త):** ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం తెలుగు జాతికే గర్వకారణం అని, ఆయన ఆశయాలు నేటి తరం కొనసాగించాలని సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు అన్నారు. జాతీయ సేవపథకం యూనిట్ల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థుల్లో మంచి లక్షణాలు అలవర్చుకోవాలంటే పొట్టి శ్రీరాములు లాంటి త్యాగజీవుల జీవిత విశేషాలు, స్వతంత్ర సమరయోధుల జీవిత విశేషాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్-






ఎస్ అధికారులు రామినాయుడు, ప్రసాద్, అధ్యాపకులు యుగంధర్, ప్రవీణ్, అధ్యాపకేతర సిబ్బంది ప్రేమ్‌బాబు , విద్యార్థిని,విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

### బిలాయిలో అమరజీవికి ఘన నివాళి

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు నిరాహారదీక్ష చేసి తన ప్రాణాలను బలిదానం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతికి చిరస్మరణీయుడని, ఆయన త్యాగం మరువరానిదని భిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు బి.జోగారావు కొనియాడారు. ఆదివారం అమర జీవి పొట్టి శ్రీరాములు 124 వ జయంతి సందర్భంగా భిలాయి నగర్ కేంప్ -1 పొట్టి శ్రీరాములు చౌక్ లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో భిలాయి తెలుగు సమాజ్ ప్రధాన కార్యదర్శి వై భాస్కర్ రావు, కోశాధికారి పి మురారి, కన్వీనర్ ఎం బాబూరావు, భిలాయి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ జె.కూర్మారావు, జి.శంకర్ రావు, బి.అప్పారావు, ఎం.ఈశ్వరరావు, ఎం.ధర్మారావు, ఎ.హేమరాజు, కె.అప్పలస్వామి, ఎస్.లక్ష్మి నారాయణ, ఎం.కూర్మారావు, ఎన్ కృష్ణారావు, జి శంకర్‌రావు, కె.శివ, కె.దిలిప్, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

## నేటి నుంచి పది పరీక్షలు

*** 149 కేంద్రాలలో ఏర్పాటు * పరీక్షలు రాయనున్న 28,984 మంది విద్యార్థులు * కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 8328269673, 9505678655 * పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాటు : డీఈవో తిరుమల చైతన్య**

శ్రీకాకుళం, మార్చి 16 (వార్త): జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. 149 పరీక్షా కేంద్రాలలో 28,984 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 149 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 149 మంది డిపార్టుమెంట్ అధికారులు, 65 మంది కస్టోడియన్లు, 2,400 మంది ఇన్విజిలేటర్ల పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు రాసేందుకు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామని డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. సందేహాలను నివృత్తి చేసేందుకు డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 8328269673, 9505678655 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. సోమవారం ప్రారంభమయ్యే పరీక్షలు ఈనెల 31 వరకూ జరగనున్నాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. వారికి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. కాగా, పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీటి సదుపాయాన్ని కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు.


## బాధితునికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్



**కొత్తూరు,మార్చి 16 (వార్త):** మండల పరిధిలోని ఇరపాడు గ్రామానికి చెందిన నిమ్మక సింహాచలం గత కొంత కాలంగా గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నారు. వైద్యం చేయించుకునే తగు ఆర్థిక స్తోమత లేకపోవడంతో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు వద్ద తన ఆవేదనను విన్నవించుకున్నాడు. దీనికి ఎమ్మెల్యే స్పందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. దీంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 1,36,326 మంజూరైంది. ఈ సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితుడికి ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆదివారం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులను బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకునే ఆర్థికస్తోమత లేక ఇబ్బందులు పడుతున్న పలు కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందించి అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సి.యం.ఆర్.ఎఫ్ నిధులను ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవే లక్ష్యంగా సీతయ్య ఫౌండేషన్

**సోంపేట, మార్చి16 (వార్త):**సోంపేట శివారులో ఉన్న సీతయ్య ఫౌండేషన్ ప్రతినిధులు సేవే లక్ష్యంగా పనిచేస్తూ ఎటువంటి దక్షత లేని నిరుపేదలకు అండగా నిలుస్తోంది. ఇందులో బాగంగా సోంపేట అంబేద్కర్ కాలనీలో ఉన్న నిరుపేదలకు బియ్యం, కాయగూరలు, బట్టలతో పాటు అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో ఉన్న ఇద్దరు దివ్యాంగుల చిన్నారులకు వీల్ చైర్‌లను సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుల్ల రమేష్, మోహనరావులు ఆదివారం అందించి మానవత్వం చాటారు. ఎటువంటి దక్షత లేని వయోవృద్ధులు, అనాథల సేవార్థం.. దాతల దాతృత్వంతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. ఆరేళ్ల నుంచి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దాతల సాయంతో సహాయ కార్యక్రమాలు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.



### తీరప్రాంత ప్రజలకు అవగాహనకే
# సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ

### కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్ పాయ్

**శ్రీకాకుళం, మార్చి16(వార్త):** తీరప్రాంత ప్రజలను అవగాహన పరిచేందుకు సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) సైకిల్ ర్యాలీ చేపట్టిందని విశాఖ పోర్టు ట్రస్టు కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్ పాయ్ వెల్లడించారు. కోలకతా రాష్ట్రంలోని బక్కలి నుండి కన్యాకుమారి (తమిళనాడు)లోని వివేకానంద రాక్ మెమోరియల్ వరకు చేపడుతున్న సైకిల్ ర్యాలీ ఆదివారం శ్రీకాకుళం కొత్త రోడ్ జంక్షన్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ర్యాలీ చేస్తున్న వారికి కొత్తరోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ సైకిల్ ర్యాలీ మార్చి 31వ తేదీకి కన్యాకుమారి చేరుకుంటుందన్నారు. వెస్ట్ కోస్ట్(భారత దేశ పశ్చిమ తీరాన) లక్ పత్ పోర్టు గుజరాత్ నుండి కన్యాకుమారి వరకు 50 మంది సైకిలిస్టులు ర్యాలీ చేస్తున్నారన్నారు. 6553 కిలో మీటర్లు సైకిల్ ర్యాలీ సాగుతుందని చెప్పారు. సైకిల్ ర్యాలీలో 14 మంది మహిళలు కూడా పాల్గొన్నారన్నారు. సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్దేశం తీర ప్రాంత ప్రజలకు సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు భారత దేశంలోకి ప్రవేశం, ఇతర దేశాల నుండి మాదక ద్రవ్యాల రవాణా వంటి వాటిపై అప్రమత్తంగా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. తీరం సురక్షితంగా ఉండేందుకు సైకిల్ ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో అప్రమత్తంగా లేకపోవడంతో ఉగ్రవాదులు భారత్‌లోకి సముద్ర మార్గం ద్వారా ప్రవేశించి పార్లమెంటుపై దాడి చేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపిసీ, విశాఖపట్నం నుండి డిప్యూటీ కమాండెంట్ వినీత్ కుమార్ ప్రభాకర్, విశాఖ స్టీల్ ప్లాంట్ నుండి సీనియర్ కమాండెంట్ ఎ.ఎం. హనీఫ్, అసిస్టెంట్ కమాండెంట్లు జి. శ్రీనివాస్, శ్రీకర్ లోహియా, తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం చేరుకున్న సైకిల్ ర్యాలీ టీంకు శ్రీకాకుళంలోని టు టౌన్ సిఐ పి.ఈశ్వరరావు, మాజీ సైనికుల అసోసియేషన్ తరఫున అధ్యక్షుడు పూర్ణచంద్రరావులు ఘనంగా స్వాగతం పలికారు. అమర సైనికులు జి.ముకుందరావు భార్య అమ్మన్నమ్మ, రామారావు భార్య వంజరాపు లక్ష్మిలకు జాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు పి. ఈశ్వరరావు, వీర నారీలు అమ్మన్నమ్మ, వంజరాపు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక గోపి డ్యాన్స్ అకాడమీ నుండి ఆర్మీ థీం, దేశ భక్తి గీతాలను ప్రదర్శించారు.





### శ్రీ సత్య సాయి విద్యావిహార్ చేరుకున్న సైకిల్ ర్యాలీ

**పలాస, మార్చి 16 (వార్త):** సమృద్ధ్ సంరక్షణ పేరుతో సిఐఎస్ఎఫ్ సిబ్బంది సైకిల్ ర్యాలీ ఆదివారం పలాసకు చేరుకుంది. రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. సీనియర్ కమాండెంట్ ఎండీ హనీఫ్ అక్తర్, భాస్కర గాంధీ బృందం ఆధ్వర్యంలో ఈ ర్యాలీ సాగుతోంది. సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీఐఎస్ఎఫ్ సిబ్బందిని స్కూల్ కరెస్పాండంట్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్, దేవరాజ్, ఉప అధ్యక్షులు శ్రీను, కార్యదర్శి శరత్, తిరుమల రావు, ఉపాధ్యాయులు అనుదీప్, ప్రవీణ, మమత,జయదేవ్ అభినందనలు తెలిపారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546